రాజకీయ లబ్ధి కోసమే లడ్డూ వివాదం

- చంద్రబాబు వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం
- వైఎస్ జగన్‌ను ఇబ్బంది పెట్టేందుకు కుట్ర
- వేంకటేశ్వరస్వామి ప్రతిష్టకు భంగం కలిగేలా తప్పుడు ప్రచారం
- వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కన్నబాబు
- వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు, నాయకులు, కార్యకర్తలు



సర్పవరం జంక్షన్‌లో పూజల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: చంద్రబాబు నాయుడు తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు, జగన్‌మోహన్‌రెడ్డిని ఇబ్బంది పెట్టేందుకు కుట్ర చేసి వేంకటేశ్వరస్వామి చరిత్ర, ప్రతిష్టకు భంగం కలిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు దుయ్యబెట్టారు. తిరుమల శ్రీవారి లడ్డూ పవిత్రతను, వేంకటేశ్వరస్వామి వారి వైభవాన్ని అపవిత్రం చేస్తున్న చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేయమని కోరుతూ కాకినాడ సర్పవరం జంక్షన్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ తిరుమల లడ్డూలో జంతు కొవ్వులు కలిశాయని సాక్షాత్తు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఎక్కడా లేని దిగజారుడు రాజకీయానికి పాల్పడుతున్నారని విమర్శించారు. లడ్డూలో వినియోగించే నెయ్యిలో ఎటువంటి జంతు కొవ్వు కలవలేదని సాక్షాత్తు ఆలయ ఈఓ చెబుతున్నారని, నాలుగు ట్యాంకర్లను వెనక్కి పంపినట్టు చెబుతున్నారన్నారు. మరి జంతు కొవ్వు ఎప్పుడు కలిసిందని ప్రశ్నించారు. మీరు అధికారంలోకి వచ్చాక కలిసిందా అని నిలదీశారు. జంతు కొవ్వు కలిసిందని ఎలా చిత్రీకరిస్తారని, ఎందుకు ఇంత కుట్రను తెరలేపారన్నారు. దేవుడుతో రాజకీయం చేయడం మంచిది కాదని అన్నారు. మీరు వేసుకున్న చిట్‌లతో కాదు సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిలతో కానీ అంతకన్నా అత్యున్నత సంస్థలతో విచారణ జరిపించాలని మేము కోరుతున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల వెళ్లి దర్శనం చేసుకుంటానంటే డిక్లరేషన్ అని తెర లేపారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులకు నోటీసులు ఇచ్చారని, ఘర్షణ వాతావరణం క్రియేట్ చేసేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. శాంతి భద్రతలకు భంగం కలగకూడదని పర్యటన వాయిదా వేసుకున్నారన్నారు. ఐదేళ్ల పాటు టీటీడీ వచ్చి స్వయంగా ఆహ్వానించడంతో బ్రహ్మోత్సవాలో పట్టు వస్త్రాలు సమర్పించారని, ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ వచ్చినప్పుడు ముఖ్యమంత్రిగా జగన్ పాల్గొన్నారని అప్పుడు డిక్లరేషన్ అడిగారా అని నిలదీశారు. జగన్ ఇప్పటికి 12 సార్లు తిరుమల వెళ్లారని, అధికారికంగా 5 సార్లు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారన్నారు. వేంకటేశ్వరస్వామిని కూడా రాజకీయాలలోకి లాగిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. మత రాజకీయాలకు పాల్పడుతున్న చంద్రబాబు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, చంద్రబాబు పాపాలు ఈ రాష్ట్ర ప్రజలకు తగలకూడదని స్వామి వారిని వేడుకుంటూ పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కురసాల సత్యనారాయణ, మాజీ మేయర్ సరోజ, జమ్మలమడక నాగమణి, చింతా ఈశ్వరరావు, అల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు, నాయకులు, కార్యకర్తలు

తన లబ్ధి కోసం దేవుడిని వదలని 'బాబు' : మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రాజకీయ లబ్ధి కోసం కలియుగ దైవం తిరుపతి వేంకటేశ్వరస్వామిని సైతం వివాదాల్లోకి లాగిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని, ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శనివారం వెంకట్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవుని ప్రార్థించారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు తొలుత ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం పూజలు చేసి తిరుపతి లడ్డూ అంశాన్ని వివాదం చేస్తోన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఇతర కూటమి నేతల బుద్ధిమారాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ లడ్డూ వివాదాన్ని చూసి ఒక భక్తునిగా తానెంతో కలత చెందానన్నారు. తిరుపతి వేంకటేశ్వరస్వామిని ఎంతో భక్తితో ఆరాధనతో కొలిచే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయ కక్షలో భాగంగానే వివాదంలోకి లాగి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. బాబు చెప్పిన మాటకల్లా పవన్ తలాడిస్తూ వ్యవహరిస్తోన్న తీరు మరింత అభ్యంతరకరంగా ఉందని విమర్శించారు. ఎన్నికల ముందుకు ప్రజలకు ఇచ్చిన సూపర్–6 హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిన చంద్రబాబు, కూటమి నేతలు ప్రజల దృష్టిని మళ్లించేందుకే తిరుమల లడ్డూ వివాదాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చారన్నారు. వేంకటేశ్వరునిపైట్ల అచంచల విశ్వాసం కలిగిన మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ఆర్ చేవెళ్ల పాదయాత్ర సమయంలో తిరుపతి సందర్శించారని, తండ్రి బాటలోనే తనయుడు కూడా పాదయాత్రకు ముందు, పూర్తయిన తరువాత కూడా స్వామి వారిని దర్శించుకున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. తాజాగా అనేక కుట్రలు పన్నిన కూటమి నేతలకు తగిన బుద్ధి చెప్పాలనే లక్ష్యంతోనే వారి ఆటలు సాగనివ్వకూడదని తిరుపతి పర్యటనను రద్దు చేసుకున్నారన్నారు. భగవంతుడు అన్నీ చూస్తున్నాడని, తగిన సమయంలో చంద్రబాబు, ఇతర నేతలకు ఆయనే తగిన శిక్ష విధిస్తారన్నారు. కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర ప్రచారకమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరయ్యారు.

క్లుప్తంగా

పెంపుడు జంతువులకు టీకాలు

కాకినాడ రూరల్: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా ర్యాబిస్ టీకాలు వేయించుకోవాలని డాక్టరు అడ్డాల సత్యనారాయణ కోరారు. అంతర్జాతీయ ర్యాబిస్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాబిస్ వ్యాధి కేంద్ర న్యాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుందన్నారు. ఇది నివారించవచ్చని, కుక్క కరిసినప్పుడు లేదా గీతలు పడినప్పుడు 15 నిముషాలు లోపు సబ్బుతో కడిగి అనంతరం వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 60 వేల మంది ర్యాబిస్‌తో మరణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రవిశంకర్ పట్నాయక్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళలది కీలకపాత్ర

బోట్‌క్లబ్: సమాజ నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. స్థానిక వెంకీ రెసిడెన్సీలో శనివారం నిర్వహించిన ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ సౌత్ జోన్ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అన్ని రంగాల్లో పురుషులతో పాటు మహిళలు కూడా అగ్రగామిగా నిలుస్తున్నారనర్నారు. మహిళలందరూ ఆర్థికాభివృద్ధిలో భాగం కావాలని సూచించారు. వృద్ధాప్యంలో కూడా ఏఐడబ్ల్యూసీ సంస్థ సభ్యులు చాలా కష్టపడి పనిచేస్తున్నారన్నారు. ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన మాట్లాడుతూ సమాజానికి సహాయం చేయడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తుండడం గర్వకారణమన్నారు. ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షురాలు కల్యాణి రాజ్, నగర అధ్యక్షురాలు పి. చిరంజీవిని కుమారి, బ్రహ్మకుమారి రజని, సభ్యులు భరతలక్ష్మి, ఎన్.భానుమతి, ఉష, పద్మజావాణి, శ్రీదేవి, భవాని పాల్గొన్నారు.

స్వచ్ఛ కాకినాడకు సహకరించండి

కాకినాడ: స్వచ్ఛ కాకినాడ దిశగా ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన పిలుపునిచ్చారు. స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక రాజాట్యాంక్ నుంచి జేఎన్‌టీయుకే వరకు సైక్లాథాన్ పేరిట నిర్వహించిన సైకిల్ ర్యాలీని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. రాజాట్యాంకు నుంచి జేఎన్‌టీయూ కళాశాల వరకు ర్యాలీ కొనసాగింది. సుమారు 200 మంది ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు రాంబాబు, సత్తప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



జేఎన్‌టీయూకేలో స్వచ్ఛభారత్ నిర్వహించిన సిబ్బంది

బాలాజీచెరువు: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు శనివారం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కాకినాడ ఎన్‌టీఆర్ బీచ్, పీఆర్ డిగ్రీ కళాశాలతో పాటు జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో పరిసరరాల పరిశుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఎస్‌బీఐ ఆర్ఎం తపోధన్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఉద్యోగులతో పాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడూ పన్నులు స్వీకరిస్తాం

కాకినాడ: మొదటి అర్ధ సంవత్సరం ముగింపును దృష్టిలో ఉంచుకుని ఆదివారం కూడా పన్నులు స్వీకరిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. ఆస్తి, కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నులను చెల్లించవచ్చునని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగరపాలక సంస్థ స్త్రీ శక్తి భవనం, నగరపాలక సంస్థ పాత భవనంలోని సివిక్ సెంటర్‌లో పన్నులు చెల్లించవచ్చునన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కాకినాడ: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద పేర్కొన్నారు. నగరపాలక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక భానుగుడి సెంటర్‌లోని పాత మీ సేవా కేంద్రం వద్ద ర్యాలీ నిర్వహించారు.

రేపు సీఐటీయూ ధర్నా

కాకినాడ సిటీ: ప్రభుత్వశాఖల్లో ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను సర్వీసు ప్రాతిపదికన పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు విలేకరులకు తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు జరిగే ధర్నాలో వివిధ ప్రభుత్వ శాఖల కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భగత్‌సింగ్‌కు నివాళి

బోట్‌క్లబ్: నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా స్థానిక రామకృష్ణారావుపేటలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి శనివారం ఘటించారు. గంగవంశం త్రినాథ్‌దేవ్, బాకితోటరెడ్డి, రాంబాబు, రామారావు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఫోరెన్సిక్ ప్రాధాన్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ నరసింహం, ఆర్ఎంసీ అధికారులు

కాకినాడ క్రైం: వైద్య రంగంలో ఫోరెన్సిక్ ప్రాధాన్యత నానాటికీ పెరుగుతోందని రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, డాక్టర్ ఎన్‌టీఆర్ యూహెచ్ఎస్ వైస్ చాన్సలర్, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. గత మూడు రోజులుగా కాకినాడ ఆర్ఎంసీ ఫోరెన్సిక్ హెచ్‌వోడీ, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, అసోసియేట్ ప్రొఫెసర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఫణికిరణ్‌ల ఆధ్వర్యంలో కాకినాడ రంగరాయ ఆడిటోరియంలో నిర్వహించిన సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ సదస్సు సిమ్లా–2024 శనివారం అట్టహాసంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఫోరెన్సిక్ నిపుణులకు బంగారు భవిత సిద్ధంచనుందన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా ఫోరెన్సిక్ వైద్యుల నియామకానికి ప్రణాళికలు ఉన్నాయన్నారు. ఫోరెన్సిక్ సేవలను మరింత విస్తరిస్తోందన్నారు. అనంతరం ఫోరెన్సిక్ సైన్స్ అంశాలపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు డాక్టర్ నరసింహం, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ శశిల చేతుల మీదిగా బహుమతులు అందజేశారు.

సర్పవరం ఆటోనగర్ ముంపు బాధితుల ఆందోళన

- స్పందించిన ఏపీఐఐసీ అధికారులు, జోనల్ మేనేజరు రమణారెడ్డి
- ఆటోనగర్ ముంపు ప్రాంతం పరిశీలన
- శాశ్వత పరిష్కారానికి హామీ



సర్పవరం ఆటోనగర్ ముంపు సమస్యను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న బాధితులు

కాకినాడ రూరల్: కొద్దిపాటి వర్షం వస్తే చాలు అంతా ముంపునకు గురై ఇబ్బంది పడుతున్నామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ సర్పవరంలోని ఏపీఐఐసీ పారిశ్రామిక వాడ ఆటోనగర్‌వాసులు శనివరాం ఆందోళన చేపట్టారు. ఆటోనగర్ ఎదురుగా సర్పవరం – మాధవపట్నం రోడ్డుపై తొలుత ధర్నాకు దిగడంతో సర్పవరం సీఐ పెద్దిరాజు, సిబ్బంది అక్కడకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు వినకుండా ఏపీఐఐసీ జనల్‌మేనేజరు రావాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జెడ్ఎం ఎ.రమణారెడ్డి, సిబ్బంది ఆటోనగర్ చేరుకుని బాధితులతో మాట్లాడారు. రెండు నెలల వ్యవధిలో మూడు సార్లు వర్షాలకు ఆటోనగర్ ముంపునకు గురయ్యిందని, రోజులు తరబడి నీరు నిలిచి ఉండడంతో తాము పనులు చేసుకోలేకపోతున్నామని ఆటోనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గరగ సత్తిబాబు, కార్యదర్శి కోలా జగదీష్, చేకూరి రామలింగరాజు, గుత్తుల వీర్రాజు, కార్మిక నాయకులు మణికంఠ, లంకే రాము తదతరులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని నిలదీశారు. ముంపు ప్రాంతాలను పరిశీలన అధికారులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్ఎం రమణారెడ్డి మాట్లాడుతూ ఏపీఐఐసీ ఆటోనగర్ లోతట్టుగా ఉండడంతో పై ప్రాంతం పంట పొలాలు నుంచి నీరు చేరుతుందన్నారు. నీరు పోయేందుకు సరైన అవుట్ లెట్ లేదన్నారు. ఆటోనగర్‌లో ప్రధాన రహదారి రూ.80లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టామని, మిగిలిన రోడ్లు ఎత్తు చేయాల్సి ఉందన్నారు. ఆటోనగర్‌లోని ఎంటర్‌ప్రెన్యూర్‌లు పనులు 60 శాతం మాత్రమే చెల్లించాలని పూర్తిగా చెల్లించాలన్నారు. రెండు నెలల్లో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పంచాయతీ భూమి కబ్జా

- ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్
- ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం



ఆర్డీవో కార్యాలయం ఏవోకి వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ సింహాద్రమ్మ

కాకినాడ సిటీ: తాళ్లరేవు మండలం చినగోవలంక పంచాయతీ పరిధిలో కొంత మంది వ్యక్తులు 16 సెంట్లు పంచాయతీ భూమిని కబ్జా చేశారని, ఆ భూమిని కాపాడాలంటూ చిన గోవలంక పంచాయతీ సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ కాకినాడ ఆర్డీవో కార్యాలయం ఏవో త్రినాథ్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. చిన గోవలంక పంచాయతీకి చెందిన 16 సెంట్లు భూమిని గతంలో మార్కెట్ షెడ్లు నిర్మించాలని తీర్మానం చేశారన్నారు. కొన్ని కారణాల వల్ల మార్కెట్ నిర్మాణం జరగలేదన్నారు. అదే గ్రామానికి చెందిన పొట్నాల దేవానందం, పొట్నాల సుధీర్, జొన్న రవిశంకర్, పొట్నాల సతీష్‌కుమార్, పొట్నాల చిదంబరనాథ్ ఈ స్థలాన్ని కబ్జా చేశారన్నారు. ఈ స్థలంలో ఆసుపత్రి నిర్మాణానికి పంచాయతీ తీర్మానించి చర్యలు తీసుకుంటే కబ్జా చేసిన వ్యక్తులు అడ్డుకుంటున్నారని, తనను పలు రకాలుగా బెదిరిస్తున్నారని సర్పంచ్ సింహాద్రమ్మ వివరించారు. అధికారులు ఈ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడి హాస్పటల్ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

సబ్బెళ్లకు పర్యాటక అవార్డు



మంత్రి కందుల దుర్గేష్ నుంచి అవార్డు అందుకుంటున్న సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి

కాకినాడ: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కాకినాడకు చెందిన రచయిత, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి రాష్ట్రస్థాయిలో పర్యాటక అవార్డు అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన రాష్ట్ర పర్యాటక అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ఆయనకు ఉత్తమ రచనలు, ప్రచురణల విభాగంలో అవార్డును అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు అండగా..



మరమ్మతు చేసిన ఇంటిని ప్రారంభిస్తున్న సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్

బోట్‌క్లబ్: విద్యుత్ ప్రమాదం జరిగి సర్వస్వం కోల్పోయిన నిరుపేద కుటుంబానికి సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అండగా నిలిచింది. స్థానిక డెయిర్‌ఫామ్ సెంటర్‌లోని రాజీవ్‌గృహకల్పలో ఇటీవల చంద్రకళకు చెందిన ఇళ్లు కూలిపోయింది. ఇంటిలో వస్తువులన్నీ కాలిపోవడంతోపాటు కుటుంబ సభ్యులు కూడా తీవ్రగాయాలయ్యాయి. వారు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చంద్రకళ కుమారుడు చదువుతున్న కళాశాల లెక్చరర్ ద్వారా విషయం తెలుసుకున్న సతీష్‌బాబు ఫౌండేషన్ సభ్యులు రామ్‌కుమార్ విషయాన్ని ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్‌కు తెలియజేశారు. ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలించిన హరీష్ వెంటనే ఫౌండేషన్, హరీష్ మిత్రబృందం సహకారంతో రూ.లక్ష ఖర్చు చేసి ఇంటికి మరమ్మతులు చేయించారు. రంగులు వేసి, ఎలక్ట్రికల్ వైరింగ్ ఇతర సదుపాయాలు కల్పించారు. ఈ మేరకు తలాటం హరీష్ శనివారం ఆ ఇంటిని ప్రారంభించారురు. తమకు అండగా నిలిచిన ఫౌండేషన్ సభ్యులకు చంద్రకళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కన్నబాబుకు అభినందనలు



కన్నబాబుకు అభినందనలు తెలియజేస్తున్న పార్టీ నాయకులు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా మూడో సారి నియమితులైన మాజీ మంత్రి, కాకినాడ రూరల్ మాజీ శాసన సభ్యులు కురసాల కన్నబాబుకు జిల్లాలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు అభినందనలు తెలియజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడి నియమితులైన కన్నబాబుకు నేరుగా, సెల్ ఫోన్ల ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా విషెష్‌లు వెల్లువెత్తాయి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కన్నబాబును కలిసిన వారిలో మాజీ మేయర్ సరోజ, అల్లి రాజబాబు, కొప్పిశెట్టి గణేష్, అనుసూరి ప్రభాకర్, కోమలి సత్యనారాయణ, సూరాడ రాజు, గొల్లపల్లి దొరబాబు, తదితరులు ఉన్నారు.

ఆపిల్ కంపెనీకి వడ్డన

కాకినాడ లీగల్: రూ.85,800 విలువ గల ఆపిల్ ఐ ఫోన్ కొంటే ఉచితంగా రూ.14,900 విలువ గల ఎయిర్ పోడ్స్ ఇస్తామని ఆపిల్ కంపెనీ వెబ్‌సైట్ ప్రకటనలో ఉండడంతో కాకినాడకి చెందిన చందలాడ పద్మరాజు 2021లో ఐఫోన్‌ను కొన్నాడు. అయితే ఎయిర్ పోడ్స్ ఉచితంగా ఇవ్వకపోవడంతో కస్టమర్ కేర్‌కి పద్మరాజు ఫిర్యాదు చేశాడు. కస్టమర్ కేర్ నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. దీనిపై పద్మరాజు 2022లో కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. వినియోగదారుల కమిషన్ సాక్ష్యాధారాలు పరిశీలించి ముంబై ఆపిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్లో వ్యాపార ప్రకటన ప్రకారం రూ.14,900 విలుగ గల చార్జింగ్ కేసుతో కూడిన ఎయిర్ పోడ్స్ కానీ రూ.14,900 రూపాయల ఇవ్వాలని, వినియోగదారుడు మానసిక ఒత్తిడికి రూ.10 వేలు ఇవ్వాలని, కోర్టు ఖర్చులు నిమిత్తం రూ.5వేలు ఇవ్వాలని కమిషన్ ఆదేశించారు. మోసపూరిత ప్రకటన వల్ల వినియోగదారులు నష్టపోకుండా ఉండాలని, ఆపిల్ కంపినీ సీఎం సహాయనిధికి రూ.లక్ష జరిమానా చెల్లించాలని కమిషన్ అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంత్ కుమార్, సభ్యులు చెక్కా సుశీల, చాగంటి నాగేశ్వరరావు తీర్పు చెప్పారు.

సంతృప్తికరమైన సేవలు అందించా

కాకినాడ: ఐదేళ్ల పదవీకాలంలో సంతృప్తికరమైన సేవలు అందించానని కాకినాడ సూపర్‌బజార్ చైర్మన్ ముమ్మిడి గోవిందు పేర్కొన్నారు. సూపర్‌బజార్ కార్యాలయంలో శనివారం సంస్థ 61వ మహాజన సభ జరిగింది. సమావేశంలో డి.ఆదినారాయణ, బి.బాలకృష్ణ, ప్రెసింగి ఆదినారాయణలను నూతనంగా డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ముమ్మిడి గోవిందు మాట్లాడుతూ తన ఐదేళ్ల పదవీకాలంలో అన్ని బ్రాంచిలలో రికార్డుస్థాయిలో విక్రయాలను పెంచి అధిక లాభాలు సాధించామన్నారు. సంస్థ సీఈవో శివాజీ గణేష్ వార్షిక నివేదికను సభ ముందు ఉంచారు. సంఘ ఎన్నికల ప్రతినిధులుగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్.సుధాకరరావు వ్యవహరించారు. వైస్ చైర్మన్ వరిపల్లి కృష్ణవేణి, డైరెక్టర్లు రావూరి వెంకటేశ్వరరావు, కందాళ్ళ కనకదుర్గ, నాగేశ్వరరావు, పట్టాభిరామయ్య, పైడిరాజు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ పాస్‌ల పంపిణీ

కాకినాడ: స్థానిక ఎంఎస్ఎన్ చార్టీస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉచిత బస్‌పాస్‌లను శనివారం పంపిణీ చేశారు. పాస్‌లు జారీకి అవసరమైన ప్రోసెసింగ్ ఫీజును కోరమండల్ ఫెర్టిలైజర్ సంస్థ సమకూర్చగా సిబ్బంది వీటిని విద్యార్థులకు అందజేశారు. కోరమండల్ సీఎస్‌వో వంశీకృష్ణ, హెచ్ఎం ఎం.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమాడి. చిత్రంలో కమిషనర్ భావన

కాకినాడ: ప్రజల సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ, గృహనిర్మాణశాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో నిర్వహించిన మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ పీడీ సత్యనారాయణ, ఈఈ వై.శ్రీనివాస్, డీఈ కేఎస్ఎన్ రెడ్డి, మెప్మాపీడీ ప్రియంవద, టీపీఆర్వో శైలజ తదితరులు పాల్గొన్నారు.